తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 వార్షికోత్సవం

విద్యుత్ తీగలు తగిలి మేకల మృతి

రామకుప్పం, జూలై 22 ప్రభాతవార్త మండల పరిధిలోని 89 పెద్దూరు పంచాయతీ గులుమడుగు గ్రామ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు తగిలి మూడు మేకలు మృతి చెందాయి. బుధవారం సాయంత్రం మేకల కాపరి అటవీ ప్రాంతం నుంచి ఆరిమాను పెంటకు తోలుకొని వస్తుండగా విద్యుత్ తీగలు మృతి చెందడంతో రైతు తంగుముత్తు కన్నీరు మున్నూరుగా విలపించాడు. ఫారెస్ట్ అధికారుల నిరక్ష్యం కారణంగా గుర్తుతెలియని వ్యక్తులు అటవీ జంతువుల వేటగాళ్ల ఉచ్చులో మూడు మేకలు బలికున్నాయని సమాచారం. అనునిత్యం మూగజీవాల వేటలో ఎక్కడపడితే అక్కడ విద్యుత్ తీగలు లాగి వేటగాళ్లు విచ్చలవిడితనంగా అమర్చుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని వేటగాళ్ల కట్టడికి చర్యలు చూపాలని స్థానికులు కోరారు.

కాణిపాకంలో

అవినీతి ఉద్యోగి సస్పెన్షన్

కాణిపాకం, జూలై 22 ప్రభాతవార్త :
కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో తన చేతి వాటాన్ని ప్రదర్శించి భక్తురాల నుంచి డబ్బులు వసూలు చేసి టిక్కెట్లు ఇవ్వకుండా ప్రత్యేక అభిషేకం సేవకు ఆలయంలోనికి అనుమతించిన ఆలయ ఉద్యోగిని బుధవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు దేవస్థానం ఈవో కే పెంచల కిషోర్ తెలిపారు. దేవస్థానంలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్తీక్ అనే వ్యక్తి ప్రత్యేక దర్శనం టికెట్ కౌంటర్ లో విధులు నిర్వహిస్తూ భక్తురాల నుంచి ప్రత్యేక అభిషేకం టికెట్ కు డబ్బులు వసూలు చేసుకుని ఆమెకు టిక్కెట్ ఇవ్వకుండా ఆలయంలోనికి అనుమతించి అవినీతికి పాల్పడి అధికారుల తనిఖీల్లో పట్టుబడిన విషయం విధితమే. ఈ మేరకు అవినీతికి పాల్పడిన కార్తీక్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తరలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

భగ్గుమన్న

బొప్పాయి రైతులు

గడ్డి కాలుస్తూ నిరసన
కనీస మద్దతు ధర రూ.18 ఇవ్వాలంటూ జెసి ప్రకటన

రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న బొప్పాయి రైతులు

రైతు సంఘం నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

రైల్వే కోడూరు అర్బన్, జూలై 22, ప్రభాతవార్త.
ఒల్వే కోడూరు నియోజకవర్గంలోని బొప్పాయి రైతులు 25 వేల ఎకరాలలో సాగు చేస్తున్నారని, 25 రూపాయలుగా ఉన్న ధర, వారం రోజుల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన సేట్లు, స్థానిక దళారులు, సిండికేట్ అయి 14 రూపాయలు ప్రకటించడంతో బొప్పాయి రైతులు సమ్మెకు పిలుపు ఇచ్చారు. 90 శాతం సమ్మె విజయవంతమైంది, బొప్పాయి లారీలు పెట్టనీయకుండా రైతులు తెల్లవారుజామున రోడ్డుపైకి వచ్చి అడ్డుకున్నారు. కాయలకు చుట్టే న్యూస్ పేపర్లు రోడ్డుపైన వేసి తగలబెట్టి నిరసన తెలిపారు. సీఎంఈఓ ఆఫీస్ నుండి ప్రభుత్వం స్పందించి కలెక్టర్ ఆదేశాల మేరకు, జాయింట్ కలెక్టర్ గోవిందరాజులు, కోడూరు తాసిల్దారు ఆఫీసులో 12 గంటలకి సమావేశం ఏర్పాటు చేశారు.రైతు సంఘ నాయకులు, రైతులు, దళారులు, అధికారులతో ఎమ్మార్వో అమర్ నాద్ అధ్యక్షతన, సమావేశం ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా, కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, హాజరయ్యారు. రైతులు రైతు సంఘ నాయకులు,ఈ సమావేశంలో, రైతులుకు జరుగుతున్న మోసాలు అన్యాయంపై, జాయింట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ మాట్లాడుతూ,గత మూడు సంవత్సరాలుగా, సేట్లు, దళారులు, సిండికేట్ ఐ, బొప్పాయి కి ధర తగ్గిస్తున్నారని, ప్రతిరోజు రెండు రూపాయలు తగ్గిస్తున్నారని, వారి పైన ప్రభుత్వాన్ని నియంత్రణ లేకపోవడం, లైసెన్స్ విధానం లేకపోవడం, విచ్చలవిడిగా రైతులని మోసం చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గత ఏడాది రైతుల పోరాట ఫలితంగా, నిలకడగా తొమ్మిది రూపాయలు కొనసాగించాలని అన్నమయ్య కలెక్టర్ నిర్ణయించారని గుర్తు చేశారు. ప్రస్తుత ఏడాది, బొప్పాయి విత్తనం, మొలకలు, దళారులపై ఆధారపడాల్సి వచ్చిందని, నాసిరకం మొలకలు ఇవ్వడంతో, పంట దిగుబడే తగ్గిందన్నారు. గతంలో మొలక 10 రూపాయలతో కొనుగోలు చేస్తే, నేడు ఒక్కొక్క మొలక 35 రూపాయలతో కొనుగోలు చేసారని, ఎరువులు, మందులు, దుక్కెలు, కూలీలు, ట్రాన్స్పోర్ట్ ఖర్చులు, విపరీతంగా పెరిగి, రైతుపెట్టిన పెట్టుబడి రావడంలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. టన్నుకి 100 కేజీలు, పోరాటం తర్వాత,కొందరు 50 కేజీలు సూటు పేరుతో, అదనపు కేజీలు తీసుకుంటున్నారని, రైతులను దోపిడి చేయడమే అని చెప్పారు. నర్సరీలు, లైసెన్స్ లేకుండా నడుపుతున్నారని, బిల్లు ఇవ్వడం లేదని తెలిపారు. సుబ్బరాజు రైతు, రైతులకు జరుగుతున్న అన్యాయం సమగ్రంగా వివరించారు. గిరి , వెంకటరమణ , హరి తమకు, రైతులకు ఎట్ల అన్యాయం జరుగుతుందో వివరించారు. దళారులు, బాల, రమేష్ బాబు, మాట్లాడుతూ, 16 రూపాయలు రైతులకు ఇస్తామని చెప్పగా, జాయింట్ కలెక్టర్ అంగీకరించలేదు . కనీసం 20 రూపాయలు ఇవ్వాలని రైతు కార్మిక సంఘ నాయకులు ప్రతిపాదించగా, జాయింట్ కలెక్టర్ స్పందించి, 18 రూపాయలు ధర కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లో తగ్గించకూడదని ఇది కలెక్టర్ చెప్పి పంపిన నిర్ణయం అని చెప్పారు. దీనికంటే తక్కువ ఇస్తే, పుల్లంపేట నందలూరు చెక్ పోస్టుల వద్ద, బండ్లు నిలిపి పక్కన పెట్టబడుతుందని, చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. నందలూరు మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ధర నిలకడగా కొనసాగడానికి, రెవెన్యూ,, ఆర్టికల్చర్, మార్కెటింగ్, అధికారులతో పాటు, సేట్లు, దళారులు, రైతు నాయకులతో, కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి సేట్లు గైహాజరయ్యారు. తిరిగి వారితో మాట్లాడతామని చెప్పారు. మార్కెటింగ్ ఏడి, సురేంద్రబాబు,సీఐ, చంద్ర శేఖర్,ఎస్సై , ప్రసాద్ రెడ్డి, ఆర్టికల్చర్ అధికారులు భాస్కర్, మార్కెటింగ్ చైర్మన్, దళారులు, రైతులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

"కల్తీ"నెయ్యి కేసులో అంతా గప్‌చుప్!

సిబిఐ సిట్...ఏకసభ్యకమిటీ నివేదికలతోనే సరిపెట్టేశారా??

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
తిరుమల లడ్డూల తయారీకి కల్తీనెయ్యి వినియోగించారనే ఆరోపణలపై రెండేళ్ళ పాటు లోతుగా కొనసాగిన దర్యాప్తు,విచారణ నివేదికల్లో చివరకు ఏం తేల్చారనేది అంతా స్తబ్ధుగా మారింది. కొండను తవ్వి ఎలుకను పట్టారనే చందంగా కొన్ని లక్షలకిలోల నెయ్యి కల్తీ జరిగిందని, లక్షల్లో చేతులు మారాయనేది 2024 జూన్‌లో ప్రభుత్వం నిర్ధారించింది. సుమారు 70లక్షలకిలోల నెయ్యి కల్తీ టిటిడికి తిరుమలకు చేరిందని, దాదాపు 300కోట్లరూపాయలుపైమాటే ఆర్థిక లావాదేవీలు జరిగాయనేది ప్రధాన ఆరోపణలు . ఆ దిశగా దర్యాప్తుకు తొలుత పోలీస్ ఉన్నతాధికారులతో సిట్ ఏర్పాటుచేసింది. సిట్ పై గత వైసిపి బోర్డు పెద్దలు ఏకంగా సుప్రీంకోర్టుకు వెళ్ళడంతో బ్రేక్ పడింది. అయితే భక్తుల మనోభావాలకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో దేవుని లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా,వినియోగించారనే కోణంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. సిబిఐ అధికారులతో, ఆహారభద్రత విభాగం అధికారులతో ,రాష్ట్రపోలీస్ అధికారులతో సిట్ బృందాన్ని నియమించి ఏకంగా ఏడాదిన్నరకాలంపైగా లోతుగా అన్ని కోణాల్లో దర్యాప్తు చేయించింది. పలువురు కాంట్రాక్టర్లను, నెయ్యిసరఫరా చేసిన సంస్థల యాజమాన్యాన్ని, ప్రతినిధులను విచారణ చేసింది. అందులో తప్పిదాలు జరిగాయని తేల్చి గతంలో పనిచేసిన టిటిడి ఉన్నతాధికారులు, మార్కెటింగ్ కొనుగోళ్ళ విభాగాల జిఎంలు, మేనేజర్లను దోషులుగా తేల్చింది. నివేదికల ఆధారంగా అసలు దోషులను తేల్చి వారిపై చట్టప్రకారం చర్యలకు ఉపక్రమించేందుకు రాష్ట్రప్రభుత్వం విశ్రాంత సిఎస్ దినేశ్‌కుమార్‌ను ఏకసభ్య కమిటీని నియమించింది, ఆయన దాదాపు ఆరునెలలపైగా సిబిఐ సిట్ నివేదికల ఆధారంగా గతంలో పనిచేసిన టిటిడి ఇఒ,జెఇఒలను,మార్కెటింగ్ ,డెయిరీ సంస్థల ప్రతినిధులను విచారణ చేపట్టారు. ఈ రెండు శాఖల నివేదికలు ప్రభుత్వానికి అందాయి.లడ్డూల కల్తీ నెయ్యి కేసులో దేశంలోని 15 ప్రాంతాల్లో గతనెలలో గుంటూరు, ఢిల్లీ, ముంబై, రాజ్‌కోట్, డెహ్రాడూన్, రూర్కీ, బికనీర్, అహల్యానగర్, దిండిగల్‌లో ఈఓ అధికారుల సోదాలు కూడా చేయడం సంచలనం రేపింది.

-త్రిసభ్య కమిటీ ఏమైందో!?:

లడ్డూలకు కల్తీనెయ్యి వెనుక కీలకంగా వ్యవహరించిన పెద్దలను మాత్రం వదలిపెట్టరాదనే నిశ్చయంతో సిబిఐ సిట్ నివేదికలు, ఏకసభ్యకమిటీ నివేదికలను ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ,పోలీస్ బాస్ డిజిపి , న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా త్రిసభ్యకమిటీ గత మేనెలలో ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ సభ్యులు బాధ్యతలు చేపట్టి తిరుమలకు రాకముందే వైసిపి వర్గాల నుండి తీవ్రస్థాయిలో పలు ఘటనలపై ఎదురుదాడి జరిగింది. విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో త్రిసభ్య కమిటీ కూడా బాధ్యతలు చేపట్టకనే అలాగే సైలెంట్ అయ్యింది. అయినా 2019-24 మధ్యకాలంలో జరిగిన టెండర్ల ప్రక్రియ, విధానాలు మార్పు, కల్తీనెయ్యి సరఫరా జరిగినా కనిపెట్టాల్సిన కొనుగోళ్ళకమిటీ, విజిలెన్స్ విభాగం పాత్ర వంటి వివరాలు వెల్లడైన నేపథ్యంలో కల్తీనెయ్యికి తెరవెనుక నడిపించిన సూత్రదారులను బయటకు తీసుకురావడంలో వెనుకడుగు వేయడం వెనుక ఆంతర్యం గుట్టు రట్టుకాలేకపోతోంది.

స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు

సామర్థ్య పెంపుదల శిక్షణ

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జులై 22 ప్రభాతవార్త:
సిఎం నారా చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్యాల సాధనకు డేటా ఆధారిత ప్రణాళికలను బలోపేతం చేయడానికి పహల్ ఇండియా ఫౌండేషన్(పిఐఎఫ్) నిర్వహిస్తున్న సామర్థ్య పెంపుదల శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని నాగార్జున వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్యాల సాధనకు జీడిపి, జీవీఏ, జీడీడీపి, జీఎండీపీలపై జిల్లా స్థాయి అధికారులకు నిర్వహించిన సామర్థ్య పెంపుదల శిక్షణా కార్యక్రమంకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంతో పాటు, తలసరి ఆదాయంను రూ.55 లక్షలకు పెంచాలనే మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. ఈ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి సంవత్సరం సుమారు 15 శాతం ఆర్థిక అభివృద్ధి రేటు అవసరం అవుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ అధికారులతో పరస్పర చర్చలు నిర్వహించి శాఖల వారీ సమస్యలు, డేటా లోపాలు, అభివృద్ధి అవకాశాలు, డేటా సేకరణ, ఆర్థిక అంచనాలు, ప్రణాళికా రూపకల్పన, పర్యవేక్షణలో ఆయా శాఖల హెచ్ఓడిలు శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంను పహల్ ఇండియా ఫౌండేషన్‌తో పాటు చెన్నై శివ్ నాడర్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ పుష్ప త్రివేది, అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనీష్ శర్మ వనరుల వ్యక్తులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, జిల్లాలోని ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు

చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ

సూళ్లూరుపేట, జూలై 22 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీల మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా నియోజకవర్గంలోని ప్రజా సమ స్యలు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. సూళ్ళురుపేట (యర్రబాలెం)లో స్థలాలు సిద్ధంగా ఉన్నందున తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని స్పష్టం కోరా రు. దొరవారిసత్రం (ఎకొల్లు)లో పెండింగ్‌లో ఉన్న అనుమతులు వెంటనే మంజూరు చేయించాలని, ఓజిలి, తడలలో స్థలాల కేటాయింపు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. పెళ్లకూరులో భూసేకరణ చేసి స్థలం కేటాయించాలని తెలిపారు. సూళ్ళురుపేటలోని నెర్రికాలువ కట్టపై నివాసముంటున్న 70 కుటుంబాలకు మన్నారు పోలూరు లేఔట్‌లో వెంటనే ప్రత్యామ్నాయ ప్లాట్లు ఇవ్వాలని సూచించారు. దొరవారిసత్రం (తనయాలి), వరదయ్యపాలెం, బిఎన్ కండ్రిగ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ 6 స్టెప్ వాలిడేషన్ పూర్తి చేసి త్వరగా పట్టాలు అందజేయాలని కోరారు. బురదమడుగు ఎస్సీ కాలనీ రక్షణ కోసం కాళంగి నది ఫ్లడ్ బ్యాంక్స్ బలోపేతం చేయడంతో పాటు ఇరిగేషన్ నిధులు మంజూరు చేయించాలన్నారు. గోపాల్‌రెడ్డి పాలెంలో తుంగల చెరువు వల్ల పంట నష్టపోయిన రైతులకు సకాలంలో పరిహారం అందించి, ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను చెప్పారు. పెళ్లకూరు మండలం రోస నూరులోని 80 గిరిజన ఎస్టి కుటుంబాలకు రెవెన్యూ, అటవీ శాఖల ఉమ్మడి పరిశీలన పూర్తి చేసి డీకేటీ పట్టాలు అందించాలని, బంగారంపేట, వేణుంబాకలోని పేద రైతుల సాగు భూములను క్రమబద్ధీకరిం చాలని కోరారు. నియోజకవర్గంలో స్మశాన వాటికలు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలను గుర్తించి, ప్రభుత్వ భూమి లేదా భూసేకరణ ద్వారా స్థలాలు కేటాయించి అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిరక్ష్యం వహించకుండా, బాధ్యతాయుతంగా పనిచేసి అభివృద్ధి ఫలాలను ప్రజలకు వేగంగా అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు.

మెగా పీటియం నిర్వహణకు

రూ .9.98 కోట్లు విడుదల

చిత్తూరు, జూలై 22 ప్రభాతవార్త
రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 24వ తేదీ నిర్వహించనున్న మెగా పిటిఎం 3.1 నిర్వహణ కోసం రూ. 9.98 కోట్ల నిధులను సర్వ శిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి శ్రీనివాసరావు విడుదల చేశారు. విడుదలైన నిధులు బుధవారం జిల్లాల ఎస్ ఎస్ ఏ ప్రాజెక్టు డైరెక్టర్ల బ్యాంకు ఖాతాలకు జమ అయ్యా అన్నారు. ఈ నిధులను సత్వరం సంబంధిత పాఠశాలల బ్యాంకు ఖాతాలకు జమ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో ఆదేశించారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

- బాలిక తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

పులిచెర్ల, జూలై 22, ప్రభాతవార్త
మండలంలోని కల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని విసి వడ్డిపల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగినట్లు బాలిక తల్లి కల్లూరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. పూతలపట్టు మండలంలోని తలుపులపల్లి గ్రామానికి చెందిన దేనంగుల రవి కుమారుడు దేనంగుల రోహిత్ (21) కొంత కాలంగా బాధిత బాలికతో ఫోన్లో మాట్లాడుతూ, ఆమెను లైంగిక వేధింపులకు గురిచేసే వాడని, బెదిరింపులకు గురిచేస్తున్నాడని బాలిక తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో జూన్ 28వ తేది బాధితురాలి ఇష్టానికి విరుద్ధంగా ఆమెను బలవంతంగా ఒక ఇంటిలోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడని బాధితురాలు భయాందోళనలకు గురై జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపలేదని విచారణలో వెల్లడైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం మధ్యాహ్నం సిఐ ఎం. జయరామయ్య ఆధ్వర్యంలో కల్లూరు ఎస్ఐ యు.వెంకటేశ్వర్లు, సిబ్బంది నిందితుడు దేనంగుల రోహిత్‌ను మండలంలోని కొమ్మిరెడ్డిగారిపల్లి క్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.

అనాలోచిత నిర్ణయాలతో శివభక్తుల తిప్పలు

అమ్మవారి గర్భగుడి కంచుగడప వద్ద దూకుతున్న మహిళలు

శ్రీకాళహస్తి,జూలై 22 ప్రభాతవార్త:
శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు, పాలకుల అనాలోచిత నిర్ణ యాలతో భక్తులకు తిప్పలుతప్పటం లేదు. దాంతో ఈ సలహాలు ఎవరు ఇస్తున్నారు? మహాప్రభో అంటూ చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం అన్‌లైన్ విధానాలతో ఒక రకమైన తిప్పలు పెడితే అధికారులు మరో అడుగు ముందు కేసి అనాలోచిత విధానాలతో తమకు ఆలోచన వచ్చిందే తడవు ఆచరిస్తూ కొత్త సమస్యలు సృష్టిస్తున్నారు.ఆలయంలో రోజుకొక నిర్ణయాలతో భక్తులకు అవస్థలు కల్పిస్తున్నారు. అయితే ఏసి గదుల్లో కూర్చొని నిర్ణయాలు తీసుకునే అధికారులు క్షేత్రస్థాయిలో భక్తులు ఎదుర్కొంటున్న తిప్పలను పట్టించుకోవటం లేదు. అయితే ఆలయంలో నిత్యం ఇఒ పర్యవేక్షిస్తుంటారు. ప్రస్తుతం కొత్తగా అమ్మవారి ఆలయంలో నిర్ణయించిన కొత్త విధానంతో సరికొత్త సమస్యలను ఎదుర్కొంటున్నారు. దేవస్థానం రక రకాల సేవలను అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సత్వర దర్శనానికి రూ.200ల టిక్కెట్లు అలాగే అంతరాలయ దర్శనానికి రూ.500ల టిక్కెట్లు ఖరారు చేసి భక్తులకు అంటగడుతున్నారు. గతంలో స్వామి అమ్మవార్ల ఆలయాల వద్ద చక్కగా ఉన్న విధానం ప్రస్తుతం ఎందుకో సమస్య సృష్టించారు. ప్రభుత్వం ఆదాయాలను సృష్టించండి అంటుంటే శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు సమస్యలను సృష్టిస్తూ భక్తులనుముప్పుతిప్పలు పెడుతున్నారు.

అమ్మవారి ఆలయంలో కొత్తసమస్య:

అమ్మవారి ఆలయంలో గతంలో రూ.500ల టిక్కెట్లును కొనుగోలు చేసిన భక్తులు స్వామి అంతరాలయ దర్శనం చేసుకున్న తరువాత అమ్మవారి ఆలయంలో దర్శనానికి వస్తారు. గతంలో అమ్మవారి ఆలయం కుడివైపు గేటు ద్వారా అంతరాలయ భక్తులకు ప్రదక్షిణకు అవకాశం కల్పించారు. దాంతో అంతరాలయ భక్తులు ఎంతో సాఫీగా వెళ్ళి వారు. అయితే ఈ గేటును మూయిం చేసారు, ఎవరి సలహానో ఏమో కానీ భక్తులను పళ్ళియార గది నుంచి అనుమతిస్తున్నారు. ఇక్కడ రూ.200లు,రూ.500ల అంతరాలయ టిక్కెట్లు కొనుగోలు చేసిన వారిని ఒకే దారి గుండా అనుమతిస్తున్నారు. దాంతో రద్దీతో పాటు అంతరాలయ దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేయటం వల్ల ప్రయోజనమేమి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఇక్కడ తోసులాట తొక్కిసలాట చోటు చేసుకుంటుంది. ఈ విధానాలకు సంబంధించి అధికారులు పునరాలోచించాల్సి ఉందని భక్తులు వాపోతున్నారు.

దారి లేక దిక్కుతోచని రైతులు

కబ్జాతో మూసుకుపోయిన రాకపోకలు

తిరుపతిరూరల్,జూలై 22 ప్రభాతవార్త:
ఏళ్ల తరబడి వున్న రైతుల రహదారి ఒక్కసారిగా మూసుకుపోవడంతో పలువురు రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తమ పొలాలకు వెళ్లే దారిని కబ్జా చేసి, కంచే వేసిన ఘటన రైతుల్లో అందోళన కలిగిస్తోంది. తిరుపతిరూరల్ మండలం తనపల్లి నల్లమాని కాల్వ లెక్కదాఖల సర్వేనెంబర్ 77 ఉన్న నక్కలకాలువ పరివాహక ప్రాంతాన్ని ఓ మోతుబారి రైతు కబ్జా చేసి, పక్క రైతులకు దారి లేకుండా చేసిన ఘటన తిరుపతిరూరల్ మండలంలో చోటు చేసుకుంది. దాదాపు 20ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు ఇదే ప్రధాన రాకపోకల మార్గం. అయితే ఇటీవల ఓ భూస్వామి రైతు ఈ దారిపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయడమే కాకుండా రాకపోకలకు అడ్డుగా గేట్ ఏర్పాటు చేశాడు. దీంతో రైతుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. పోలాలకు వెళ్లేందుకు మార్గం లేక పంటలు చూసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. రైతులు చెబుతున్న వివరాల మేరకు ఆ భూస్వామి తన 11ఎకరాల భూమి చుట్టూ కొబ్బరితోట ఏర్పాటు చేసుకున్నాడు. అంతే కాకుండా దురాశతో సమీపంలో వున్న కాలువ గడ్డను కూడా ఆక్రమించి పెన్సింగ్ వేసినట్లు ఆరోపిస్తున్నారు. రాకపోకలకు అడ్డుగా ఎందుకు గేట్ ఏర్పాటు చేశారని భూ స్వామి రైతును రైతులు ప్రశ్నించగా 'నా భూమి' అంటూ ఎదరు తిరగడంతో పాటు బెదిరింపులకు కూడా పాల్పడుతున్నాడని అంటున్నారు. ప్రస్తుతం మామిడి తోటలలో మామిడి పంటలు ఉన్నప్పటికీ దారి లేక కోత కూడా కోయలేక తీవ్ర నష్టాలు చవిచూస్తున్నామి రైతులు మునిరత్నంరెడ్డి, నరసింహారెడ్డి, మునిరత్నంరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, రైతుల పోలాలకు వెళ్లేందుకు మూసుకుపోయిన దారిని తెరిపించాలని రైతులు వేడుకొంటున్నారు.

భూసార పరీక్ష ప్రాముఖ్యతపై విద్యార్థులకు శిక్షణ: ఏవో

రైల్వేకోడూరు రూరల్, జులై 22 ప్రభాతవార్త భూసార పరీక్షలపై పాఠశాల విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రైల్వేకోడూరు వ్యవసాయ అధికారి పండుగోల సందీప్ అన్నారు. ప్రభుత్వ మోడల్ పాఠశాల విద్యార్థులకు భూసార పరీక్ష కేంద్రం తిరుపతి జిల్లా వనరుల కేంద్రం తిరుపతి, కోడూరు మండల వ్యవసాయ అధికారి సంయుక్తంగా భూసార పరీక్ష ప్రాముఖ్యతపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు కళ్యాణ్, పరమేశ్వరి, కుమ్ముదా, భూసార పరీక్ష నిర్వహించడానికి మట్టి సేకరణ విధానాన్ని భూసార పరీక్ష కావాల్సిన మట్టిని సేకరించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో అనంతరాజుపేటలోని ఎనిమిది మరియు తొమ్మిది తరగతులకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో గ్రామ ఉద్యాన సహాయకుడు హరిబాబు, విస్తరణ అధికారి నరసింహులు,ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చియ్యవరంలో అతుకుబడిపై గ్రామసభ

రైల్వేకోడూరు రూరల్, జులై 22 (ప్రభాతవార్త) మండలంలోని చియ్యవరం గ్రామంలో డీటీ గల్లా రమణ, వీఆర్వో అరవ వెంకటయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక రైతు అతుకుబడి పట్టాపై సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతు అతుకుబడి పట్టాపై గ్రామసభలను నిర్వహిస్తున్నామని రైతులకు ఉన్న అతుకుబడి నెంబర్లపై ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రతి ఒక్క రైతుకు సంబంధిత అధికారులు తప్పక న్యాయం చేస్తారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైల్వేకోడూరు మండలంలో 21 పంచాయతీలలో అతుకుబడి పట్టాలపై గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో కోడూరు నాయకుల సమావేశం

రైల్వేకోడూరు రూరల్, జులై 22 ప్రభాతవార్త మండలానికి చెందిన వైసిపి నాయకులైన ఆర్వి రమణ, మైనార్టీ నాయకులు షేక్ షఫీ, బీసీ నాయకులు బత్తల మనీతో పాటు పలువురు వైసీపీ కార్యకర్తలు బుధవారం తాడేపల్లి లోని వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరుకు చెందిన ప్రముఖ రాజకీయాలపై మాజీ ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఇందులో కొంతమంది పార్టీ కార్యక్రమాలకు వెళ్లకుండా ఒక నాయకుడు పై అసంతృప్తితో రగిలిపోతున్నారని, దీనిపై పూర్తిగా వైసిపి పార్టీకి నష్టం జరిగే విధివిధానాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్ డాక్టర్ భూపతి నాయుడికి ఘన సన్మానం

తిరుపతి విద్య జూలై 22 ప్రభాత వార్త ఎస్.వి.యు రిజిస్ట్రార్‌గా డాక్టర్ భూపతి నాయుడు విజయవంతంగా రెండేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. వర్సిటీ పరిపాలనా భవనంలోని రిజిస్ట్రార్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఆయనకు దుశ్శాలువా కప్పి, శాలువాతో సత్కరించి, అందమైన పుష్పగుచ్ఛాన్ని అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... గత రెండేళ్లుగా విశ్వవిద్యాలయ పరిపాలనా రంగాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో డాక్టర్ భూపతి నాయుడు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఎస్.వి.యూ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు గుర్రంకొండ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నెల్లూరు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కోటగారం మురళి, జాయింట్ సెక్రటరీ ఆర్. ముత్తువేలు, కోశాధికారి కటారి గురు ప్రసాద్‌లతో పాటు మీడియా కోఆర్డినేటర్‌మనోజ్‌కుమార్‌సింగ్,పలువురుకార్యవర్గ సభ్యులు, సచివాలయ, వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

నాచురల్ సైన్స్ బ్లాక్‌లో వాష్‌రూమ్ సమస్యను వెంటనే పరిష్కరించాలి

ఎస్వీయూ వీసీ ఛాంబర్ ఎదుట ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ ధర్నా...

తిరుపతి విద్య, జూలై 22 ప్రభాతవార్త శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని నాచురల్ సైన్స్ బ్లాక్‌లో నెలకొన్న వాష్‌రూమ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు వీసీ ఛాంబర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు చిన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ... గత రెండేళ్లుగా నాచురల్ సైన్స్ బ్లాక్‌లో విద్యార్థినులకు వాష్‌రూమ్ సౌకర్యం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళనపై స్పందించిన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ వెంటనే యూనివర్సిటీ ఇంజనీర్‌ను పిలిపించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఇంజనీర్ తాండవ కృష్ణ, జువాలజీ విభాగాధిపతి రాజశేఖర్, కిషోర్‌లు విద్యార్థి నాయకులతో కలిసి నాచురల్ సైన్స్ బ్లాక్‌లోని వాష్‌రూమ్‌లను నేరుగా పరిశీలించి స్పష్టమైన హామీ ఇవ్వడంతో విద్యార్థులు తమ ఆందోళనను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు రవి యాదవ్, వెంకటేశులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవిత్ర, అక్బర్, సహాయ కార్యదర్శి వినోద్, నాయకులు దినేష్, అంజలిలతో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

జూలై 24న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్

తిరుపతి విద్య, జూలై 22 ప్రభాతవార్త వరుసగా జరుగుతున్న నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, అవినీతికి కేంద్రంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 24వ తేదీన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పరిధిలోని అన్నమయ్య భవనంలో బుధవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు, పిడిఎస్ఓ, ఎన్ఎస్ యుఐ, డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బంద్ పిలుపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సి. ప్రవీణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, ఎన్ఎస్ యుఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ... లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నెల రోజులుగా విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా, ప్రముఖ పర్యావరణవేత్త సోను వాంగ్చుక్ 20 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నీట్ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, పారదర్శకమైన జాతీయ పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 24న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు చిన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పవిత్ర, ఎన్ఎస్ యుఐ జిల్లా కార్యదర్శి బాలాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, వినోద్, ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీటీడీ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి విద్య జూలై 22 ప్రభాత వార్త తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్వహించే జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి గురువారం నుంచి రెండు రోజుల పాటు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. కళాశాలల్లో ఇప్పటికే ఆరు విడతల సాధారణ కౌన్సిలింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావడంతో, ఇంకా మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అధికారులు ఈ ప్రవేశాలను చేపడుతున్నారు. తిరుపతిలోని ప్రసిద్ధ ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్వీడబ్ల్యూ (శ్రీ పద్మావతి మహిళా) జూనియర్ కళాశాలల్లో గురు, శుక్రవారాల్లో ఈ స్పాట్ ప్రవేశాలు జరగనున్నాయి. ఈ రెండు కళాశాలల్లోనూ కలిపి ప్రస్తుతం సుమారు 400 సీట్లు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఈ సీట్ల భర్తీ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు అధికారులు ముందస్తు సమాచారం అందించారు. టీటీడీ కళాశాలల్లో ఉన్న అత్యుత్తమ విద్యా ప్రమాణాల దృష్ట్యా రాయలసీమలోని పలు జిల్లాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీ సంఖ్యలో తరలిరానుండటంతో ఆయా ప్రాంగణాలు సందడితో జాతర వాతావరణాన్ని తలపించనున్నాయి.

విద్యార్థుల చేత చాకిరీ ఏంటి సారూ !!

శాంతిపురం, జూలై 22 ప్రభాతవార్త బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించి పిల్లలు చదువుకునేలా ప్రభుత్వం ఓ పక్క చర్యలు తీసుకుంటుంటే మరో పక్క కొందరు ఉపాధ్యాయులు పాఠశాలలో చదివేందుకు వచ్చిన పిల్లలతో పనులు చేయించడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు విద్యార్థిమిత్ర కిట్లు, షూలు, బ్యాగులు పంపిణీ చేసింది. ఇవి స్థానిక ఎంఇఒ కార్యాలయంకు చేరాయి. బుధవారం హైస్కూల్ విద్యార్థులకు బ్యాగులు పంచాలని ఉపాధ్యాయులు భావించి పనిలో పనిగా కొందరు విద్యార్థులను తమ వెంట తీసుకొచ్చి వారిచే బ్యాగులు మోయించి ఆటోల్లో తరలించడం కన్పించింది. దీంతో స్థానికులు ఇదేం తీరుసారూ అంటూ పేర్కొనడం కన్పించింది. ఇదిలా ఉంటే ఉపాధ్యాయులు బ్యాగుల తరలింపుకు స్వచ్ఛరథాన్ని సైతం వాడడం విమర్శలకు దారి తీస్తోంది. ఈవిషయంగా డిఇఒతో ప్రభాతవార్త ఫోన్‌లో మాట్లాడగా ఆయన ఎంఇఒతో మాట్లాడి విద్యార్థులను పంపించేశారు.

వేరుసెనగ..టమోటా బీమాకు రేపు ఆఖరు

శాంతిపురం, జూలై 22 ప్రభాతవార్త ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న వేరుసెనగ, టమోటా పంటల భీమాకు ఈనెల 24తేది ఆఖరు తేదీ అని ఎఒ పద్మజ తెలిపారు. టమోటా పంటకు ఎకరంకు రూ 1500లు, వేరుసెనగ పంటకు రూ 560లు ప్రీమియ చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే వరి పంటకు ఎకరాకు రూ 840లు ఆగస్టు 15లోపు, రాగిపంటకు రూ 170, కందిపంటకు రూ 400లు ఈనెల 31లోగా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాంతిపురంలో పోలీసులచే ఫుట్‌పెట్రోలింగ్

శాంతిపురం, జూలై 22 ప్రభాతవార్త మండల కేంద్రమైన శాంతిపురంలో బుధవారం సాయంత్రం రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రోడ్డు పక్కన ఉన్న వాహనాలను తీయించారు. దుకాణదారులు సిసి కెమెరాలు ఏర్పాటుచేసుకో వాలన్నారు. అలాగే ప్రజలు కూడా శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ధైర్యస్పర్శ కార్యక్రమంపై ప్రజలకు వివరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజల భద్రతే పోలీసుల బాధ్యత

– వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ చిన్నపెద్దయ్య

చిత్తూరు, జులై 22 ప్రభాతవార్త: ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ చిన్నపెద్దయ్య అన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బుధవారం చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో పోలీసులు కట్టమంచి పరిధిలో 'సురక్షిత చిత్తూరు–మీ భద్రత మా బాధ్యత' కార్యక్రమంలో భాగంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ చిన్నపెద్దయ్య మాట్లాడుతూ నేరాల నివారణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం సైతం ఎంతో కీలకమన్నారు. తమ పరిసరాల్లో అనుమానస్పద వ్యక్తులు, గుర్తు తెలియని వస్తువులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కన్పిస్తే సత్వరం సమీప పోలీస్ స్టేషన్ లేదా 112కు సమాచారం అందించాలన్నారు. అలాగే మహిళలు, చిన్నారుల భద్రత అంశాలపై అప్రమత్తంగా వుండాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల బారిన పడకుండా అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటిపీలు, బ్యాంకు వివరాలను ఎవరికి వెల్లడించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మారెప్ప, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం పెంపు

గుడిపాల, జులై 22 ప్రభాతవార్త: క్రీడలతో యువతలో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నాయనపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం ఎస్ఐ రామ్మోహన్ స్థానిక యువతతో కలిసి సరదాగా వాలీబాల్ క్రీడ ఆడారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్థానిక యువతతో ఆత్మీయంగా మమేకమై యువత మొబైల్ ఫోన్లతో కాలక్షేపం చేయకుండా, చెడు అలవాట్లకు దూరంగా వుంటూ విద్య, క్రీడలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు.

విధిగా ప్రతి ఒక్క రైతు పంట బీమా ప్రీమియం చెల్లింపు

యాదమరి, జులై 22 ప్రభాతవార్త: ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతు విధిగా పంటల బీమా ప్రీమియంను విధిగా చెల్లించి పంటకు బీమా చేయాలని వ్యవసాయశాఖ ఎడి ఉమా కోరారు. మండల పరిధిలోని ఓటేరుపల్లి పంచాయతీ మంగళపల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రం పరిసరాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఎఒ దీప ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎడి ఉమ మాట్లాడుతూ రైతులకు పంటల సాగుకు అవసరమైన యూరియాను ఎపిఎఐఎంఎస్ మాడ్యుల్ ద్వారా పంపిణీ చేస్తున్నామని, ఎలా పొందాలనే విషయంపై ఆమె అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు తదితర వైవిధ్య పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు.

25న జడ్పీ సమావేశం

చిత్తూరు, జులై 22 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను చర్చించడానికి జడ్పీ సమావేశభవనంలో జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ సిఇఒ రవవికుమార్ నాయుడ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో చర్చించడానికి పాలకవర్గం 11 అంశాలతో అజెండా సిద్ధం చేసిందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, భూసంరక్షణ, ఉద్యానవనశాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణం, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, స్త్రీ శిశు సంక్షేమశాఖలపై సమీక్ష వుంటుందన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు జడ్పీటిసీలు, ఎంపిపిలు హాజరు కావాలని జడ్పీ సిఇఒ రవికుమార్‌నాయుడు కోరారు.

రాయితీ వేరుసెనగ గల్లంతు

– మండల మీట్‌లో సభ్యుల ధ్వజం

బంగారుపాళ్యం, జులై 22 ప్రభాతవార్త: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు రైతులకు సబ్సిడీతో పంపిణీ చేయాల్సిన వేరుసెగన విత్తనాలను కూటమి ప్రభుత్వం జులై నెల ముగుస్తున్నా ఇప్పటి వరకు పంపిణీ చేయలేదని సభ్యులు ధ్వజమెత్తారు. బంగారుపాళ్యం ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపిపి అమరావతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిటిసీలు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేయాల్సిన సబ్సిడీ వేరుసెగన విత్తనాలను కూటమి ప్రభుత్వం గల్లంతు చేసిందని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో సబ్సిడీ వేరుసెనగ విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నప్పటికీ వ్యవసాయశాఖ స్పందించడం లేదని ఆరోపించారు. వేరుసెనగ విత్తనాల పంపిణీపై ఎఒ లక్ష్మీ మాట్లాడుతూ మండలానికి 1,500 టన్నుల విత్తన కాయలు అవసరమని ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడా విత్తన కాయలు పంపిణీ జరుగలేదని, ప్రభుత్వం విత్తనాలు అందించిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తామన్నారు. ఓటరు ప్రక్రియ(ఎస్ఐఆర్) సమగ్రంగా నిర్వహిస్తున్నామని డిప్యుటీ తహసిల్దారు బాబు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా 226 మంది అడ్మిషన్లు జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి రమేష్ తెలిపారు. అలాగే తల్లికి వందనం కింద మండలంలో రూ.10 కోట్ల వరకు విడుదల కానున్నదన్నారు. ఈ సమావేశంలో జడ్పీటిసీ సోమశేఖర్, వైస్ ఎంపిపిలు శిరీష్‌రెడ్డి, జయకుమార్‌లు, ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ పురుషోత్తం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు మైక్ పద్ధతి

చిట్వేలి, జులై 22, ప్రభాతవార్త: మండల కేంద్రమైన చిట్వేలిలో ట్రాఫిక్ రద్దీని పూర్తిగా నియంత్రించి, ప్రజలకు మెరుగైన సేవలు అందిం చేందుకు ప్రధాన కూడళ్ళలో ఆధునిక పబ్లిక్ అడ్రస్ (మైక్) వ్యవస్థను బుధవారం ఎస్సై వినోద్ కుమార్ సిబ్బందితో కలిసి ప్రారంభించారు. తద్వారా సిబ్బంది ఒకచోట నుంచి వాహనాలను గమనిస్తూ వాహనదారులకు హెచ్చరికలు, సూచనలు జారీ చేయనున్నారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నళ్లను పాటించడం, అత్యవసర వాహనాలకు దారి ఇవ్వడం వంటి అంశాలపై నిరంతరం సూచనలు అందించబడతాయని తెలిపారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తారా

– ఎమ్మెల్సీ భరత్

కుప్పం, జూలై 22 ప్రభాతవార్త రామకుప్పం మండలం పెద్దతాండా మాజీ సర్పంచ్ మోహన్‌నాయక్‌పై తెదేపా నేతలు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడం తగదని ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహన్ నాయక్‌ను ఆయన పరామర్శించి సంఘటన వివరాలు అడిగి తెలుసుకుని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వభూమి 52 ఎకరాల్లో తెదేపా నేతలు కబ్జా చేస్తున్నారని మోహన్ నాయక్ ఇదివరకే జిల్లా కలెక్టర్, కడ పి.డి., ఆర్డీఓలకు ఫిర్యాదు చేశాడని దీంతో కక్ష గట్టి అతనిపై దాడులు చేశారని ఆరోపించారు. తెదేపా నేతలు నీతి,నిజాయితీతో రాజకీయం చేస్తే సహకరిస్తామన్నారు. దాడులతో తమ పార్టీ నేతలు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను లక్ష్యంగా చేసుకున్నారనే సమాచారం తమకు ఉందన్నారు. దీన్ని ఎదుర్కొంటామన్నారు. న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. నిందితులను చట్టం ముందర నిలబెడతామన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో రక్తదానం..వైద్య శిబిరం

కుప్పం, జూలై 22 ప్రభాతవార్త స్థానిక డాక్టర్ వైసి జేమ్స్ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో పిఇఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణా రావు మాట్లాడుతూ రక్తదానం సమాజంలో పది మంది ప్రాణాలు కాపాడేందుకు చేసే మహత్తర కార్యక్రమంఅన్నారు. విద్యార్థులు రక్తదానంకు మరిం త ముందుకు రావాలని కోరారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఇఎన్‌టి, చర్మ సంబంధిత సమస్యలకు సంబంధించి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్, హెచ్ఒడి డాక్టర్ సయ్యద్ హుసేన్ మియా, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

కుప్పం, జూలై 22 ప్రభాతవార్త రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ దస్తావేజు లేఖరులు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం బుధవారం కూడా కొనసాగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జిఓ నెం 396ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో రిజర్వేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయరాదన్నారు. రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేట్ పరం చేయరాదని డిమాండ్ చేశారు. ఇలా చేస్తే దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు, డిటిపి ఆపరేటర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం దస్తావేజు లేఖరుల లైసెన్సులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్థసారథి, మహేంద్ర, చిరంజీవి, శంకర్, రఘు, రామస్వామి, మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఘర్షణకు రాజకీయ సంబంధం లేదు : డిఎస్పీ

కుప్పం, జూలై 22 ప్రభాతవార్త రామకుప్పం మండలంలో మంగళవారం రాత్రి జరిగిన వ్యక్తిగత ఘర్షణలకు రాజకీయ సంబంధం లేదని కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం డిఎస్పీ మీడియాతో మాట్లాడారు. రామకుప్పం మండలం పెద్దతాండాపంచాయతీలో మాజీ సర్పంచ్ మోహన్‌నాయక్ మరో ఇద్దరు మద్యం సేవించి కృష్ణానాయక్ అనే వ్యక్తికి ఫోన్‌చేసి దూషించారని దీంతో కృష్ణానాయక్ అతని భార్య వచ్చి వారిని ప్రశ్నించగా ఇద్దరి మధ్య తోపులాట, ఘర్షణ జరిగిందన్నారు. ఇది కేవలం వ్యక్తిగత గొడవేనన్నారు. ఇందుకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. మోహన్‌నాయక్, కృష్ణానాయక్‌లు బంధువులు కూడా అవుతారన్నారు. ఇది తమ విచారణలో తేలిందన్నారు. ఈవిషయంగా ఎవరూ తప్పుడు ప్రచారాలు

నారాయణ పాఠశాలలో అక్షరాలా ప్రజాస్వామ్య పండుగ...

విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారం

తిరుపతి విద్య , జూలై 22 ప్రభాతవార్త

విద్యార్థులలో నైతిక విలువలతో కూడిన సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా తిరుపతి జీవకోన సమీపంలోని నారాయణ విద్యాసంస్థల టీపీటీ జేవీకే క్యాంపస్‌లో విద్యార్థి సార్వత్రిక ఎన్నికలు మరియు ప్రమాణ స్వీకార (ఇన్వెస్టిట్యూర్) వేడుకలు బుధవారం అత్యంత శోభాయమానంగా నిర్వహించబడ్డాయి. దేశ ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను ప్రతిబింబించేలా, ఓటింగ్ విధానం నుంచి ఫలితాల ప్రకటన వరకు నమూనా పద్ధతిలో నిర్వహిస్తూ విద్యార్థి లోకానికి పరిపాలనా వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన వేడుకలో ఎన్నికల్లో విజయం సాధించిన నూతన విద్యార్థి ప్రతినిధులు పాఠశాల కేబినెట్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విద్యాసంస్థల ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ఐ వసంత్ మాట్లాడుతూ పాఠశాల దశ నుంచే విద్యార్థులకు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తమైనవని కొనియాడారు. కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా క్రమశిక్షణ, నిరంతర శ్రమ, దృఢమైన ఆత్మవిశ్వాసంతో కూడిన నాయకత్వ పటిమను అలవరచుకున్నప్పుడే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ సుధాకర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో పుస్తక పరిజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యత, నాయకత్వ పటిమ పెరిగినప్పుడే పరిపూర్ణ విద్య సాధ్యమవుతుంది. పాఠశాల దశలోనే ఎన్నికల ప్రక్రియ ద్వారా ఓటు హక్కు విలువను, ప్రజాస్వామ్య వ్యవస్థ తీరుతెన్నులను విద్యార్థులకు ఆచరణాత్మకంగా చూపించాలనే లక్ష్యంతోనే ఈ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించాము. బాధ్యతలు స్వీకరించిన విద్యార్థి నాయకులు తోటి విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తూ, క్రమశిక్షణతో పాఠశాల పురోగతికి కృషి చేయాలి. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ దాక్షాయణి, డీడీ ఎణ్ముగానంద, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బందితో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని నూతనంగా బాధ్యతలు చేపట్టిన విద్యార్థి నాయకులను అభినందించారు. అంతిమంగా సర్వజనుల ఆత్మోన్నతిని చాటుతూ జాతీయగీతాలాపనతో ఈ వేడుకలు ప్రశాంతంగా, ఘనంగా

ఆర్‌డిఎక్స్ లైన్ మార్చి ఆదుకోండి: దేశం నాయకుల ధర్నా

ఏర్పేడు జూలై 22 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం ముసలిపేడు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఆర్‌డిఎక్స్ లైన్‌ను రోడ్డుకు దూరంగా మార్చేందుకు నిర్ణయించారు. ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు సహకారంతో, ముసలిపేడు మాజీ సర్పంచ్ వై.మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముసలిపేడు సబ్ స్టేషన్ పరిధిలోని ముసలిపేడు, సరస్వతీకండ్రిగ, కందాడ, సదాశివపురం, బతినయ్య కాలనీ, వేడం గ్రామాల్లో ప్రస్తుతం రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ లైన్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బి అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో రోడ్డుకు దూరంగా కొత్తగా ఆర్‌డిఎక్స్ లైన్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి డిఈ రియాజ్,వర్క్ ఇన్స్పెక్టర్ మురగయ్య నాయుడు, ఏర్పేడు విద్యుత్ ఏఈ మరియు లైన్ మెన్లు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

శ్రీకాళహస్తి రూరల్ జూలై 23 ప్రభాతవార్త: మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శి మించల శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య హాజరై మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న ఇన్‌పుట్ సబ్సిడీ, రుణమాఫీ, కరెంటు, సాగునీరు వంటి సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి పార్టీ తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏర్పేడు మండల పార్టీ కార్యదర్శి సిహెచ్. శివకుమార్, సహాయ కార్యదర్శి తొన్నాటి రమేష్ పాల్గొన్నారు. అలాగే పలువురు రైతులు ఈ సమావేశంలో పాల్గొని తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.

నీట్ పేపర్ లీక్‌పై కాంగ్రెస్ ఆందోళన

శ్రీకాళహస్తి జూలై 22 ప్రభాతవార్త: నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డా. ఎస్.బత్తెయ్యనాయుడు తీవ్రంగా ఖండించారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బీజేపీ నేత అభిజిత్ దీప్కే నాయకత్వంలో యువత 32 రోజులుగా నిరసనలు తెలుపుతున్నారనితెలిపారు. నిన్నపార్లమెంట్‌ను దిగ్బంధం చేయడానికి ప్రయత్నించిన యువతపై పోలీసులు నిర్లక్ష్యంగా దాడి చేసి గాయపరిచారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు జనార్దన్ రెడ్డి, వెంకట ముని, నాగూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై పోలీసుల తనిఖీలు

తొట్టంబేడు, జూలై 22 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం నుంచి స్వర్ణముఖి నది నుంచి విచ్చలవిడిగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లపై బుధవారం పోలీసులు నిఘా ఉంచారు. ఈనేపథ్యంలో బుదవారం పెన్నలపాడు వద్ద తొట్టంబేడు ఎస్ఐ బి.బాలకృష్ణ ఇసుక ట్రాక్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పలు ట్రాక్టర్ల డ్రైవర్ల వద్ద డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ లేకపోవడం గుర్తించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో మాట్లాడిన ఎస్ఐ, డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగిఉండాలని, వాహనాలకుసంబంధించినఅన్నిరికార్డులుసక్రమంగా ఉంచు కోవాలని సూచించారు.

ట్రాక్టర్ బోల్తా : గాయపడిన వారికి పరామర్శ

తొట్టంబేడు, జూలై 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం రౌతుసూరమల గ్రామ హరిజనవాడకు చెందిన దగ్గులు చిన్నమ్మ అనే తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్త రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చిన్నమ్మ ట్రాక్టర్‌లో వెళ్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆమెకు రెండు కాళ్లు విరిగిపోయాయి. వెంటనే స్థానికులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు చిన్నమ్మను ఆసుపత్రిలో పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ప్రజాస్వామ్యంను అపహాస్యం చేయొద్దు

శ్రీకాళహస్తి జూలై 22 ప్రభాతవార్త: లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ నూళ్లూరుపేట నియోజకవర్గం నందు డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు, కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని భారీ ర్యాలీగా వెళ్లి బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగం బ్రతకాలని పూలమాలలు వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ నేడు భారతదేశం లో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందన్నారు. జిల్లా నాయకులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, మండల అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంతో ప్రతి ఇంటా విద్యా వెలుగు : సుబ్బయ్య

శ్రీకాళహస్తి జూలై 22 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం ద్వారా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంపై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మాసారపు సుబ్బయ్య హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలను దిగ్విజయంగా అమలు చేస్తున్నారని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు సమన్వయంతో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని తెలిపారు.

జి.ఓ.396 సవరించాలని రైటర్ల నిరసన

శ్రీకాళహస్తి, జూలై 22 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జి.ఓ.నెం 396ను సవరించాలని కోరుతూ శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు రైటర్ల నిరసన బుధవారం 3వ రోజు కొనసాగింది. నూతన జి.ఓ వల్ల తమ ఉపాధి దెబ్బతింటుందని, అనేక కుటుంబాలు రోడ్డున పడతాయని రైటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దస్తావేజుల పనిని ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం వల్ల ప్రజల ఆస్తులకు కూడా ఇబ్బంది ఉంటుందన్నారు. సోమవారం నుంచి నెలాఖరు వరకు పెన్ డౌన్ చేపట్టామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైటర్లు పాల్గొన్నారు.

చెత్తలోనూ వివక్ష...దళిత కాలనీలపై ఆంక్షలు

శ్రీకాళహస్తి రూరల్, జూలై 22 ప్రభాతవార్త: దళిత కాలనీల్లో వచ్చే చెత్తను చెత్త నుండి సంపద కేంద్రాలకు తరలించొద్దని కూటమి ప్రభుత్వ నాయకుడు అడ్డుకుంటున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘంజిల్లా గౌరవ అధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఆరోపించారు. తొండమ నాడులోని అరుంధతివాడ, హరిజనవాడ, ఎగువ వీధిలలో మంగళవారం రాత్రి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో సామాజిక శంఖారావం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. సమస్య లు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంధం మణి, గురవయ్య, రాధమ్మ, హరి తదితరులు పాల్గొన్నారు

జీవో నెంబరు 396ను రద్దు కోసం దస్తావేజు లేఖర్లు ఆందోళన

సత్యవేడు, జూలై 22 ప్రభాతవార్త: భూములు రిజిస్ట్రేషన్ వ్యవహారాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.396ను రద్దుచేయాలంటూ దస్తావేజు లేఖర్లు ఆందోళన కొన సాగిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం తిరుపతి జిల్లా సత్యవేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో జీవో నెం.396కు వ్యతిరేకంగా పలువురు డాక్యుమెంటరీ రైటర్స్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్యుమెంటరీ రైటర్స్ పలువురు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం పీపీపీ విధానంలో జీవో నెం.396 ద్వారా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో వేలాది మంది డాక్యుమెంటరీ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక డాక్యుమెంటరీ రైటర్స్ బాలాజీరెడ్డి, పి.ఆర్.శివకుమార్, ఎస్.జయకుమార్, ఎస్.రాజశేఖర్, జక్కల శ్రీరాములు, హిమవంతు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అనధికార హాకర్లపై కొరడా

తిరుమల,జులై 22ప్రభాతవార్తప్రతినిధి: పుణ్యక్షేత్రం తిరుమలలోని పలు ప్రాంతాల్లో అనధికారికంగా పలు రకాల వ్యాపారాలు చేసుకుంటూ...చిరువ్యాపారులైన హాకర్లపై బుదవారం ఉదయం తిరుమల పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది కొరడా ఝుళిపించారు. ప్రధానంగా శ్రీవారి ఆలయం ముందు, ఆస్థానమండపం వద్ద, వరాహస్వామి విశ్రాంతి గృహాలు, మఠాల ప్రాంతాల్లో రకరకాలుగా అనధికారికంగా వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించారు. వీరితో శాంతిభద్రతలకు విఘాతంతోబాటు గొడవలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయి. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాలతో తిరుమల 1,2టౌన్ పోలీసులు,విజిలెన్స్ సిబ్బంది అనదికార హాకర్లను గుర్తించి వారిని తిరుపతికి తరలించారు. తగిన జరిమానాలు కూడా విధించారు.

పుత్తూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు

పుత్తూరు రూరల్, జూలై 22 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రత్యేక చొరవతో పుత్తూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పట్టణ పరిధిలోని 22వ వార్డు పరిధిలోని ఆరేటమ్మ కాలనీలో రూ.8.50 లక్షల వ్యయంతో జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులను పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు, 22వ వార్డు మాజీ కౌన్సిలర్ గాలి జీవరత్నంనాయుడు ప్రారంభించారు. ఎమ్మెల్యే చొరవ పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలోయూనిట్ ఇన్‌చార్జి ఆర్.మాధవనాయుడు, పట్టణ టీడీపీ అధికార ప్రతినిధి ఓ.బాబు, తడుకు సింగిల్‌విండో ప్రెసిడెంట్ కరుణ, చిరంజీవులు, శీను తదితరులు పాల్గొన్నారు.

జీవో 396ను తక్షణమే రద్దు చేయాలి

– పాకాలలో 3వ రోజుకు చేరిన దస్తావేజు లేఖర్ల నిరవధిక సమ్మె

పాకాల, జూలై 22, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 396ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాకాల దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక పెన్ డౌన్ సమ్మె బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు, డ్రైవర్ల వెల్ఫేర్ సంఘం ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల సంఘ నాయకులు మాట్లాడుతూ జీవో 396 పేరుతో రిజిస్ట్రేషన్ వ్యవస్థను కార్పొరేటీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమన్నారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

విజయపురం, జూలై 22 ప్రభాతవార్త: బాల్య వివాహాలపై అవగాహన అవసరమని మండల విద్యాశాఖ అధికారి-2 శ్రీనివాసులు తెలిపారు. బుధవారం విజయపురం జడ్పీ హైస్కూలులో నగరి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఇందిరా ప్రియదర్శిని అధ్యక్షతన కిషోర బాలికల వికాసం, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం నేరమని, అంతేకాకుండా అఅందు వల్ల జరిగే దుష్ఫలితాలను తెలియజేశారు. కార్యక్రమంలో చిత్తూరు వన్ స్టెప్ అడ్మిన్ అధికారి చెందురాణి, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు సుమతి, మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు హైమావతి, విజయ, వనిత, విక్టోరియా, ఆశ కార్యకర్తలు షీబ, పుష్ప, కిషోర బాలికలు పాల్గొన్నారు.

26న శిల్పారామంలో "విశ్వశాంతి వైదిక మహాయజ్ఞం"

తిరుచానూరు, జులై 22 ప్రభాతవార్త: 26వ తేదీ తిరుపతి శిల్పారామంలో "విశ్వశాంతి వైదిక మహాయజ్ఞం" నిర్వహించనునట్లు నిర్వాహకులు కిషన్ లాల్ శర్మ బృందం తెలిపారు. ఈ మహాయజ్ఞంలో అందరూ పాల్గొని పునీతులు కావాలని కోరారు. బుధవారం శిల్పారామంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వారణాసిలోని ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రాలలో ఒకట్టైన "స్వరవేద మహా మందిర ధామం" ఆధ్వర్యంలో జరిగే ఈ యజ్ఞానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని తెలిపారు. శ్రీరామావతారానికి కారణమైన "పుత్రకామేష్టి యజ్ఞాన్ని" దశరథ మహారాజు కోసం నిర్వహించిన శృంగి మహర్షి వారి పవిత్ర వంశపారంపర్యానికి చెందిన సద్గురువులు దీనిని నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తిరుపతిలోని" శ్రీ బాలాజీ హాస్పిటాలిటీ సర్వీసెస్ హోంస్టేస్", మైటెంపుల్ దర్శన్ సంస్థల అధిపతి కే.కుమార్‌నాయుడు కార్యక్రమాన్ని జరిపిస్తున్నారని తెలిపారు.

గంజాయిపై అవగాహన

శ్రీకాళహస్తి రూరల్,జూలై 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామానికి సమీపంలో ప్రకాష్ ఫెరోర్ పరిశ్రమలో పని చేస్తున్న స్థానికేతరులైన కార్మికులకు బుధవారం రూరల్ సిఐ ఇబ్రహింసారధ్యంలో గంజాయి,మద్యం సేవించుటకు సంబంధించి అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఇటీవల ఇక్కడ పని చేసే కార్మికులు గంజాయి మత్తుకు బానిసలౌతున్నారు. ఈ నేపథ్యంలో రూరల్ పోలీసులు గంజాయి ప్రమాదం గురించి మద్యం వల్ల విధినిర్వహణలో ప్రమాదాల గురించి వివరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి : 8మంది అరెస్టు

తొట్టంబేడు,జూలై 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పిచ్చాటూరు మార్గంలోని రాజీవ్‌నగర్‌లో చాటుగా జరుగుతున్న పేకాట శిబిరాలపై టూటౌన్ పోలీసులు దాడి చేసి జూదమాడుతున్న 8మందిని అరెస్టు చేసి వారిన ఉంచిరూ.7900ల నగదునుస్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ జ్యోతి బుధవారం తెలిపారు. బుధవారం సాయంత్రం అకస్మికంగా దాడి చేసినట్లు ఆమె వివరించారు. నిందితులను ఆదువులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పవన్ కోలుకోవాలని వారాహి పూజలు

శ్రీకాళహస్తి,జూలై 22 ప్రభాతవార్త: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జనసేనాని వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని విధులకు హాజరు కావాలని ప్రజలకు సేవలందించాలని కోరుతూ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ సారధ్యంలో బుధవారం వారాహి పూజలను నిర్వహించారు. బోర్డు సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, ఆలయ కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశులు పాల్గొన్నారు.

ఎవరి ఓట్లు తొలగించటం లేదు: డిటి

తొట్టంబేడు, జూలై 22 ప్రభాతవార్త: ఓటర్లు ఎవరూ తమ ఓట్లు తొలిగిపోతాయని కంగారు పడాల్సిన అవసరం లేదని, తొట్టంబేడు డిప్యూటీ తాసిల్దార్ జీవన్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం వార్త పత్రికలో ప్రచురితమైన నువ్వు బతికున్న మా లెక్కలో చనిపోయావు అనే శీర్షిక వెలువడింది స్పందించిన డిప్యూటీ తహసిల్దార్ మండలంలోని పూడి పంచాయతీలో ఎస్ఐఆర్‌లో జరుగుతున్న పొరబాట్లపై పరిశీలనకు తహసీల్దార్ భారతి ఆదేశాల మేరకు డిప్యూటీ తహసిల్దార్ బుధవారం గ్రామానికి వెళ్లారు. బిఎల్ఏలతో సమావేశం పోలింగ్ స్టేషన్ 263కు సంబంధించిన బిఎల్ఏల సమక్షంలో గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో (బిఎల్ఓ) భాగ్యశ్రీ, ఎలక్షన్ ఆపరేటర్ సురేష్, వీఆర్ఏలు హరి, శివ, టిడిపి పార్టీ బిఎల్ఏ ప్రభాకర్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ నరసింహారావుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

ఎస్వీ పాలిటెక్నిక్‌లో డీఫార్మసీ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి విద్య జూలై 22 ప్రభాత వార్త తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను రెండేళ్ల కాలవ్యవధిగల డీఫార్మసీ (డిప్లొమా ఇన్ ఫార్మసీ) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై. ద్వారకనాథ్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్‌లో బైపీసీ లేదా ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు బుధవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు సమర్పించడానికి ఆగస్టు 6వ తేదీ వరకు గడువు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కోర్సు ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు 9908857585, 9966761446, 9550690007 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో డీఫార్మసీ కోర్సులో ప్రవేశాలు

తిరుపతి విద్య జూలై 22 ప్రభాత వార్త తిరుపతిలోని టీటీడీ శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో 2026 27 విద్యా సంవత్సరానికి గాను రెండేళ్ల కాలవ్యవధిగల డిప్లొమా ఇన్ ఫార్మసీ (డీఫార్మసీ) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. పద్మావతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌బీఏ గుర్తింపు, పీసీఐ ఆమోదం పొంది ఎస్‌బీటీఈటీ మంగళగిరికి అనుబంధంగా నడుస్తున్న ఈ కళాశాలలో కేవలం అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ పూర్తి చేసిన విద్యార్థినులు నేరుగా ఫార్మసీ విభాగాధిపతిని కలవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజుతో పాటు చేరిన విద్యార్థినులందరికీ ఉచిత హాస్టల్ వసతి మరియు భోజన సౌకర్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం ,8978993810, 9247575386,9299008151 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఆగస్టు 3న తిరుపతిలో భారీ జాబ్ మేళా...

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి విద్య జూలై 22 ప్రభాత వార్త నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆగస్టు 3వ తేదీన తిరుపతిలో భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఈ జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పలు ప్రముఖ బహుళ జాతి కంపెనీలు (ఎం ఎన్ సి లు) పాల్గొంటున్న ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని కోరారు. మొత్తం 1029 ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం ఆగస్టు 3వ తేదీ ఉదయం 8 గంటల నుంచి బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ ఎంపికలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆగస్టు 2వ తేదీ లోపు హెచ్ టి టి పీ ఎస్ ://స్రైపుణ్యం .ఏపీ .జి ఓ వి .ఇన్ / వెబ్‌సైట్ లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ సందేహాలు, ఇతర వివరాల కోసం 7013509543, 9988853335 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సులేమాన్ భాషా, సీనియర్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ స్నాతకోత్సవంలో వై.మల్లికార్జునరావుకు గోల్డ్ మెడల్

తిరుపతి విద్య, జూలై 22 ప్రభాత వార్త శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) నిర్వహించిన 67వ స్నాతకోత్సవంలో ఎంఎస్‌సీ సైకాలజీ (డీడీఈ) విభాగంలో వై. మల్లికార్జునరావు ప్రతిష్ఠాత్మక ఖిఅకాడమీ ఆఫ్ సైకాలజిస్ట్స్ఖి గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. 2024 విద

లాభాలు వచ్చే పంటలపై విస్తృతంగా అవగాహన

- మామిడి సాగు రైతుల వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలన
-ఈ-క్రాప్ నమోదు వేగవంతం - కలెక్టర్

చిత్తూరు, జులై 22 ప్రభాతవార్త: వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు క్షేత్ర స్థాయిలో తిరిగి రైతులకు తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులతో మామిడి సేకరణ పురోగతి, ఈ క్రాప్ బుకింగ్, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, అర్హులైన రైతుల గుర్తింపు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఒకొక్క రైతుకు అందించే సబ్సిడీని పారదర్శకంగా, నిజమైన లబ్దిదారులకు అందేలా ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. దీనికోసం మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది సంయుక్త బృందాలుగా ఏర్పడి ప్రతి గ్రామంలో మామిడి పంట పండించిన రైతులను గుర్తించాలన్నారు. మామిడి పంటకు సంబంధించిన ప్రతి నమోదును ఈ-క్రాప్ వివరాలతో సరిపోల్చి అవసరమైన చోట భౌతిక పరిశీలన నిర్వహించాలన్నారు. కేవలం ఈ-క్రాప్ నమోదుపైనే ఆధారపడకుండా క్షేత్ర స్థాయిలో పంట వాస్తవంగా వుందా! లేదా! అనే అంశంను నిర్ధారించాల న్నారు. వ్యవసాయ భూమి కలిగిన రైతులు, కౌలుదారులు ఈ పథకానికి అర్హులని, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, భూమి పాసు పుస్తకం నకలు, పంటవేసినట్లు ధృవీకరణ పత్రం లేదా స్వీయ ధృవీకరణ, ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతా, భూ వివరాలు, ఇతర అవసరమైన పత్రాలతో సమీప కామన్ సర్వీసు, పంటల బీమా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సతీష్, మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వరన్, హార్టికల్చరల్ అధికారి కోటేశ్వరరావు, ఇతర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోండి

సూళ్లూరుపేట, జూలై 22 ప్రభాతవార్త: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే ఉద్దేశంతో అందజేసిన స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో వై వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం మండల పరిధిలోని మాంగా నెల్లూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, ప్రజలకు మౌలిక వసతులు గురించి పరిశీలించారు. స్వచ్ఛ రథంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకొని విధంగా అవగాహన ప్రజలకు కల్పించారు. అనంతరం గంగా నెల్లూరులోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.

పెరిమెడి బీసీ కాలనీలో నిలిచిన నీరు

బాలాయపల్లి, జూలై 22 ప్రభాతవార్త: మండలంలోని పెరిమిడి బీసీ కాలనీలో వర్షానికి నీరు చేరి ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు రూపాయిలు. గ్రామంలో వీధులకు రోడ్లు లేనందున ఎప్పుడు వర్షం వచ్చినా మగాడి లోతు నీరు చేరుతున్నట్టు తెలిపారు. తాగునీటి బోరు చుట్టు నీరు చేరినట్లు చెప్పారు. గ్రామంలో రోడ్డు వేయాలని పలు దపాలు అధికారులు ప్రజా ప్రతినిధులకు చెప్పిన ఫలితం లేదన్నారు. ఎంపీ గురుమూర్తి కూడా రోడ్డు వేయించాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఎంపీ నిధులతో ఆయన రోడ్డు వేయించాలని వాడు తెలిపారు. వర్షపు నీరు నిలబడడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. వర్షపు నీరు వాళ్ళ దుర్గంధపూరితమైన వాసన, దోమలు వస్తున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారులైన చర్య తీసుకుని రోడ్డు వేయించాలని కోరారు.

బంగారు భవిష్యత్తుకు విద్యే పునాదులు!

-ఎస్ఎంఆర్ ఫౌండేషన్‌చే ఉత్తమ విద్యార్థులకు సన్మానం

శ్రీకాళహస్తి,జూలై 22 ప్రభాతవార్త: ఓ మనిషికైనా బంగారు భవిష్యత్తుకు ఆతని సంస్కారం, విద్యే పునాది అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సుబ్బమ్మ మోమన్‌రావు ఫౌండేషన్ సారధ్యంలో పదవ తరగతిలో ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. పట్టణంలోని మున్సిపల్ సరస్వతి బాయి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. సభకు ఉద్యోగ విరమణ చేసిన ఫౌండేషన్ నిర్వాహకులు మోహన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ ఫౌండేషన్ ప్రతి ఏడాది పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి, పట్టణ పేరుతో పాటు తల్లిదండ్రుల ఆశలను నెరవేరుస్తున్న చిన్నారులకు ప్రోత్సహంగా సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి,తొట్టంబేడు మండలాల పరిధిలోని పాఠశాలల్లో 1 నుంచి 3 ర్యాంకులు సాధించిన విద్యార్థులు 45 మందిని నేడు సన్మానించే భాగ్యం భగవంతుడు తనకు కల్పించాడని వివరించారు. తన కుటుంబం యావత్తు ఉపాధ్యాయులుగా కొనసాగామని విద్య ప్రాధాన్యత తమకు బాగా తెలుసునన్నారు. 'భవిష్యత్తును విద్యార్థి దశలో విద్యే పునాది అని' ఆయన వివరించారు. ఈ సభలో మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నేడు విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గతం కన్నా నేడు ప్రభుత్వం ఎన్నో సంస్కరణలతో ప్రభుత్వ బడుల్లో తీసుకొచ్చారన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెమొంటో, మెడల్స్, మెరిట్ సర్టిఫికేట్లతో సత్కరించారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, పివిఆర్ గ్రూప్ డైరెక్టర్ ముకుందరావు జె.పవార్, పూల కృష్ణయ్య, ఎస్ఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మోహన్ రావు, అధ్యక్షులు ఎస్‌కుమార్ మోహన్‌రావు, సహాయ కార్యదర్శి ఎస్.పుష్ప జ్యోతి, ఏ.జెస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్దాం...చేస్తున్న మంచిని చెబుదాం

- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, జూలై 22 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఈనెల 27వతేది నుంచి ప్రతి ఇంటికీ పార్టీ శ్రేణులు వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచినా ప్రజలకు చెబుదామని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంకు జిల్లా టిడిపి అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్ చౌదరి, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు హాజరయ్యారు. తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహంకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పంలో ఈనెల 27నుంచి సిఎం సతీమణి నారా భువనమ్మ పర్యటన ఉ ంటుందని ఈ పర్ యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సుపరిపాలన, ప్రజా సంక్షేమాన్ని ప్రజల్లో మరింత తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూలత ధోరణి మరింత పెంచేలా చూడాలన్నారు. అలాగే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలన్నారు. పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ కుప్పం చరిత్రను సిఎం చంద్రబాబు తిరగరాస్తున్నారన్నారు. పదివేల కోట్ల పెట్టుబడులతో పరి శ్రమలు తెచ్చారని, రైతుల కోసం కృష్ణాజలాలు తెచ్చారన్నారు. అభివృద్ధి, సంక్షమం రెండు కళ్లుగా సిఎం చేస్తున్న మంచిని ప్రజల్లో తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, కాణిపాకం వెంకటేష్, ఉదయ్, సుబ్బు, వెంకటరమణ, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి ఎంతో అవసరం

తిరుపతి, జులై 22 ప్రభాతవార్త: ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలకు స్వయం ఉపాధి సాధించడం ఎంతో అవసరమని, ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా నైపుణ్యాభివృద్ధి సాధించి మంచి ఆర్థికంగా ఎదగాలని వక్తలు తెలియజేశారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం,లైఫ్లీ హుడ్ బిజినెస్ ఇంకు బేటర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో మూడు నెలల అప్పేరల్ డిజైనింగ్ 45 రోజుల కంప్యూటర్ ఎంబ్రాయిడరీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమ య్యాయి. ఆచార్య జీవనజ్యోతి లైఫ్లీహుడ్ బిజినెస్ ఇంకుబేటర్ కో ఆర్డినేటర్ మాట్లాడుతూ మహిళా అధ్యయన కేంద్ర డైరెక్టర్ సోషల్ సైన్స్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్మెంట్ డీన్ ఆచార్య పి.విజయలక్షి మ్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఎంతో డిమాండ్ ఉన్నటువంటి దుస్తుల తయారీ రంగంలో నాణ్యమైన శిక్షణ ఆధునిక యంత్రాలు వినియోగంపై అవగాహన కలిపిస్తూ స్వయం ఉపాధి ప్రారంభించేందుకు అవసరమైన మార్గదర్శ కత్వం దుస్తుల డిజైనింగ్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ,వ్యాపార నిర్వహణ,ఆన్లైన్ మార్కెటింగ్ వంటి అంశాలలో శిక్షణ అందించబడుతుందన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ స్వాతి మాట్లాడుతూ మహిళా సాధికారతకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శిక్షణ పొందిన మహిళలకు ఆర్థిక స్వాలంబన సాధించడానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటామని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ మహిళా అధ్యయన కేంద్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె హైమావతి, మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది, విద్యార్థులు, బోధన, బోధ నేతర సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో కార్డియాలజిస్టు వైద్య సేవలు

తిరుపతి హెల్త్, జూలై 22 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానముల శ్రీవారి వైద్యసేవలో భాగంగా శ్రీ వేంకట్వేర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) నందు యశోదా ఆసుపత్రి హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎం.సాయి ఆదిత్య జూలై 23వ తేదీ నుండి మూడు రోజుల పాటు పేషంట్లకు వైద్యసేవలు అందించనున్నారని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన పేషంట్లు స్విమ్స్ కార్డియాలజి విభాగం నందు ఓపి తీసుకుని డాక్టర్ ఎం.సాయి ఆదిత్యని సంప్రదించవచ్చు. ఈ అవకాశాన్ని పేషంట్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 9154216307 నంబరులో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించగలరని తెలిపారు.

భక్తులను కటాక్షించిన శ్రీఎల్లమ్మ తల్లి

రేణిగుంట, జూలై 22 ప్రభాతవార్త : సన్నిధికి వచ్చి దర్శించుకోలేని భక్తుల కోసం శ్రీఎల్లమ్మ తల్లి రేణిగుంట పట్టణంలో ఊరేగింపు సేవతో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. గత సోమవారం నుండి జరుగుతున్న శ్రీ ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవం అమ్మవారి ఊరేగింపుతో ముగిసింది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో శాశ్వత ధర్మకర్తలు ఎలుమలై రెడ్డి, సరసమ్మ, తులసి రెడ్డి, భాగ్యమ్మ, బాలాజీ, అన్నసంతర్పణ నిర్వహించి భక్తులకు భోజనం వడ్డించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి రేణిగుంట పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఊరేగిస్తున్న సమయంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయ ఫలాలు పుష్పాలు సమర్పించి అమ్మవారి కృపకు పాత్రులైనట్లు భావించారు.

గుండెపోటుతో ప్రైవేటు పాఠశాల టీచర్ మృతి

ఎమ్మెల్యే సంతాపం

నారాయణవనం, జూలై 22 ప్రభాతవార్త: మండలంలోని భీముని చెరువు గ్రామానికి చెందిన బాలిగాని.హరిబాబు(37) మంగళవారం గుండెపోటుతో దుర్మరణం చెందారు. పుత్తూరు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో కెమిస్ట్రీ అధ్యాపకుడిగా విధులుగా నిర్వహిస్తున్నారు. మంగళవారం కూడా పాఠశాల విధులకు హాజరైనారు. మధ్యాహ్నం హరిబాబుకి హఠాత్తుగా గుండెపోటు రావడంతో పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం గ్రామ సమీపంలోని అన్నాగౌరి మెడికల్ అండ్ హాస్పిటల్‌కి వెంటనే తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దుర్మరణం చెందారు. మృతునికి భార్య లక్ష్మీ (27), కుమారులు దర్శిత్(7), దర్శన్(5), వర్షిత్ (2)లు వున్నారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్, సత్యవేడు నియోజకవర్గ టిడిపి బిఎల్ఎ ఇంచార్జీ కోనేటి సుమన్‌కుమార్, ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది బుధవారం ఉదయం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

మామిడి విదేశాలకు ఎగుమతి కావడం శుభపరిణామం

రేణిగుంటజూలై 22 ప్రభాతవార్త : మామిడిపండ్ల ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేయడానికి అనుమతులు లభించడం మామిడి రైతులకు శుభవార్త అని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, రాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం, రాస్ కృషిజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శ్రీనివాసులు సంయుక్తంగా అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నందు బుధవారం ప్రముఖ శీతల పానీయాల సంస్థ సౌజన్యంతో జాతీయ మామిడి దినోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవన అధికారి జయభారత్ రెడ్డి, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ సామాజిక ప్రకృతి వ్యవసాయ పథకం సంచాలకులు షణ్ముఖం, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల కు చెందిన సుమారు 250 మంది రైతులు పాల్గొన్నారు. వక్తలు రైతులకు మామిడి పంటపై అవగాహన కల్పించారు. మామిడి ఉత్పత్తులకు విదేశీ అనుమతులు రావడం రైతులకు శుభసూచకం అన్నారు. ఉన్నతి మ్యాంగో పథకంలో భాగంగా మామిడి పంట మంచి దిగుడులు సాధించిన రైతులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కెవికె ప్రచురణలను ఆవిష్కరించారు. చివరగా షెడ్యూల్డ్ కులాల రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు..

మనబడి-మన భవిష్యత్‌పై ఓరియెంటేషన్

తిరుపతిరూరల్, జూలై 22 ప్రభాతవార్త తిరుపతి డివిజన్ పరిధిలోని 9మండలాల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో 'మనబడి-మన భవిష్యత్' కార్యక్రమం కింద ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక ఓరియెంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. తిరుపతిరూరల్ మండలం ఎంపిడిఓ సమావేశ మందిరములో జరిగిన ఈ కార్యక్రమానికి తిరుపతి డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (ఇవైఇవో) ఇందిరాదేవి అధ్యక్షత వహించారు. 9 మండలాలకు చెందిన ఎంఈఓ-2లు, ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. సమావేశంలో పాఠశాలల్లో పెండింగ్‌లో వున్న మౌళిక వసతులపై ప్రత్యేకంగా చర్చించారు. ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన త్రాగునీటి సౌకర్యం, టాయిలెట్ సదుపాయాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, అలాగే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు వంటి అంశాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఎపిఓ సుధాకర్‌నాయుడు, టెక్నికల్ టీమ్ రిసోర్స్ పర్సన్ రాజేష్ తదితరులు పాల్గొని పాఠశాల అభివృద్ధి పనుల అమలు విధానంపై వివరాలు తెలిపారు.

పీహెచ్సీలో వైద్యులపై...

మద్యం మత్తులో దాడికి యత్నం

తొట్టంబేడు, జూలై 22 ప్రభాతవార్త: పూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న సిబ్బంది ప్రతి రోజూ విధులను ప్రాణాలరచేత పట్టుకొని నిర్వహించే దుస్థితి చోటుచేసుకుంది. ఎప్పుడు ఎవరు తమపై దాడి చేస్తారో? ఇబ్బంది పెడతారో తెలియని స్థితి చోటు చేసుకుంది. మండలంలోని పూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మద్యం మత్తులో వచ్చిన కొందరు వ్యక్తులు విధుల్లో ఉన్న డాక్టర్, నర్సులను వేధించిన ఘటన సిబ్బందిలో కలకలం రేపింది. ఈ మేరకు బుధవారం ప్రభాతవార్త ఆ గ్రామానికి వెళ్ళగా అక్కడున్న డాక్టర్ తమగోడు వెల్లబోసుకున్నారు. పూడి పీహెచ్సీకి మద్యం మత్తులో వచ్చిన కొందరు యువకులు అత్యవసర వైద్యం పేరుతో గొడవకు దిగారు. విధుల్లో ఉన్న డాక్టర్, నర్సులపై అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా దాడి చేసేందుకు యత్నించారు. సిబ్బంది ఎంత వారించినా వినకుండా హాస్పిటల్ పరికరాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ప్రతి పీహెచ్సీలో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలి అని సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి, అన్ని పీహెచ్సీలలో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఐఓఎస్ గుర్తింపు పొందిన... పంచాయతీగా కార్వేటినగరం

చిత్తూరు, జులై 22 ప్రభాతవార్త: సుపరిపాలన, నాణ్యమైన సేవలందింపు, ప్రజా కేంద్రిక పాలనలో విశిష్ట ప్రతిభ కనబరచిన ఐఓఎస్ 9001ః2015 నాణ్యత నిర్వహణ వ్యవస్థ ధృవీకరణ పొందిన కార్వేటినగరం గ్రామ పంచాయతీని కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం కార్వేటినగరం డిప్యుటీ ఎంపిడిఓ బివి మధుసూధన్‌కు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఐఓఎస్ 9001ః2015 నాణ్యత నిర్వహణ వ్యవస్థ జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతిష్టాత్మకమైన ధృవీకరణ పంచాయతీగా కార్వేటినగరం నిలవడం జిల్లాకు గర్వకారణం అన్నారు. తాడేపల్లిలో ఈ నెల 15వ తేదీన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ ఎంవి కృష్ణతేజ చేతుల మీదుగా కార్వేటినగరం గ్రామ పంచాయతీకి ఐఎస్ఓ 9001ః2015 సర్టిఫికేట్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా పంచాయతీ అధికార ప్రభాకర్‌రావు, కార్వేటినగరం డిప్యుటీ ఎంపిడిఓ మధుసూధన్‌లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. సమర్థవంతమైన పాలన, పారదర్శకత, నాణ్యమైన సేవలు, ప్రజలకు వేగవంతమైన సేవలందింపులో కార్వేటినగరం గ్రామ పంచాయతీ అనుసరిస్తున్న విధానాలకు గుర్తింపుగా ఈ ఐఎస్ఓ ధృవీకరణ లభించిందన్నారు. జిల్లాలోని ఇతర గ్రామ పంచాయతీలు సైతం కార్వేటినగరం పంచాయతీని స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ సేవలు అందించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

బహుళ పంటల సాగుతో అధిక ఆదాయం

చిట్వేలి, జూలై 22 ప్రభాతవార్త : తక్కువ వ్యవదిలో దిగుబడి నిచ్చే బహుళ అంతర పంటలను ప్రతి రైతు సాగు చేయాలని తద్వారా అదికాదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి జి.సుధాకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోల్లోపల్లి, దేవమాచుపల్లి గ్రామాలలో "పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులతో కలిసి నిర్వహించారు. అధికారి సుధాకర్ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న భీమా అవసరాన్ని,అందుబాటులో ఉన్న యాంత్రీకరణను రైతులకు వివరించారు.ఎల్నినో ప్రభావంతో వర్షభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ఆరు తడి పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు.అలాగే వరి, అరటి,వేరుశనగ సాగు చేసిన రైతులు గడువు లోపల పంట బీమా పూర్తి చేయాలన్నారు.నూతన సాంకేతికతలు, నీటి సంరక్షణ పద్ధతులు, ఎరువుల సమర్థ వినియోగం, పంటల రోగ నివారణ చర్యలపై సమగ్ర వివరణను రైతులతో పంచుకున్నారు.రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా ఖర్చులు తగ్గించి లాభాలను పెంచుకోవచ్చని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమాచారం అందించి వాటిని నియోగించుకోవాలని అధికారి సుధాకర్ కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ, సేంద్రీయ వ్యవసాయ సిబ్బంది, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

నకిలీ తాళాలతో షోరూమ్‌లో చోరీ-రూ.1.54లక్షలు

తిరుపతి,జులై 22ప్రభాతవార్త: తిన్న ఇంటికే కన్నంవేసిన చందంగా నమ్మకంగా పనిచేస్తున్న షోరూమ్‌లోనే నకిలీ తాళాలతో షోరూమ్ షట్టర్ తెరచి ఏకంగా అందులోని నగదును చోరీ చేసిన ఘనుడి ఉదంతమిది. తిరుపతిలో జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే....తిరుపతి నగరం మంగళం మార్గంలోని సుబ్బారెడ్డి నగర్ ఈకార్ట్ లో గతంలో షాడో ఫ్యాక్స్ హబ్ ఇన్చార్జిగా అశోక్ అనే వ్యక్తి పనిచేశాడు. ఆయన ఏకంగా వారంరోజుల క్రిందట నకిలీ తాళాలతో షోరూమ్ తెరచి చోరీ చేసుకెళ్ళాడు. 1,54,170 లక్షల రూపాయలు నగదు అపహరించుకెళ్ళాడు. సిసి కెమెరా ఫుటేజ్ ద్వారా పనిచేసిన అశోక్ చోరీ చేసినట్టు గుర్తించారు. ప్రస్తుత ఇన్‌చార్జ్ హరి నాయక్ అలిపిరి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అలిపిరి సిఐ రామకిశోర్ ఆధ్వర్యంలో ఎస్సై రామాంజనేయులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

డిఎస్‌టీ-ఎస్‌టీఐ హబ్ ప్రారంభం

తిరుపతి,జులై 22 ప్రభాతవార్త: భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ ఆర్థిక సహకారంతో పట్టు పరిశ్రమ వ్యవసాయం జీవనో పాధుల్లో సాంకేతిక ఆధారిత వినూత్న పద్ధతులు అంశంపై సదస్సు జరిగింది. డిఎస్‌టీ-ఎస్‌టీఐ హబ్ పద్మావతి మహిళా విశ్వవిద్యాల యంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికారిక లోగోను ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టు మూడు సంవత్సరాల కాలానికి మంజూరై, ఎస్సీ ఎస్టీల మహిళలు విద్యార్థినులను విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి మరియు స్థిరమైన జీవనోపాధి అవకాశాల ద్వారా సాధికారత కల్పించడం ప్రధాన లక్ష్యంగా కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమా వెన్నం ఎస్‌పిఎంవివి, డిఎస్‌టీ-ఎస్‌టీఐ హబ్‌ను ప్రారంభించి, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధిలో విజ్ఞాన శాస్త్రం సాంకేతికత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ హబ్ ద్వారా మహిళలకు సాంకేతిక పరిజ్ఞానం, వ్యవస్థాపక నైపుణ్యాలు అందించడంతో పాటు పట్టు పరిశ్రమ, వ్యవసాయం అనుబంధ రంగాలలో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని ఆమె పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష మహిళలు ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా విజయవంతమైన వ్యవస్థాపకులుగా ఎదిగి సమాజాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక ఆహ